సాక్షి మెదక్

బుధవారం । 3 । మే । 2023



కాటేజీల నిర్మాణం చకచకా

నర్సాపూర్‌లో అటవీ శాఖ నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 8లో



ఎలా తొలగిస్తారు? 9లో

మా స్థలంలో మేము కట్టుకుంటున్నాం. మీరు ఎలా తొలగిస్తారంటూ కొందరు తహసీల్దార్‌ను అడ్డుకున్నారు. అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు.

13న ఎకనామిక్స్ ఎగ్జామ్

మెదక్ కలెక్టరేట్: మంగళవారం జరగాల్సిన ఓపెన్ స్కూల్స్ ఇంటర్ తెలుగు మీడియం ఎకనామిక్స్ పరీక్ష అనివార్య కారణాల వల్ల రద్దు అయినట్టు డీఈఓ రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ నెల 13న ఉదయం అవే కేంద్రాలలో పరీక్ష ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

బాధితులకు వెంటనే సాయం అందించాలి



సఖీకేంద్ర భవన పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్‌జోన్: ఆపదలో ఉన్న బాధితులకు వెంటనే సాయం అందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. పట్టణంలో స్వాడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా కొనసాగుతున్న సఖీ కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీతో కలిసి సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సఖీ కేంద్రానికి వివిధ రకాల సమస్యలతో వచ్చిన బాధితులకు పోలీసులు తక్షణమే న్యాయ సహాయం చేయాలని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాదిలో ఇప్పటివరకు కేంద్రానికి వచ్చిన 833 కేసుల్లో 734 కేసులను పరిష్కరించారని, పెండింగ్‌లో ఉన్న 99 కేసుల్లో కూడా సత్వర న్యాయం జరిగేలా చూడాలని కేంద్రం నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం సఖీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతతో పనులు చేయాలని, మే నెలాఖారునాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వాడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి శివకుమారి, పంచాయత్‌రాజ్ ఈఈ సత్యనారాయణ రెడ్డి, డిప్యూటీ ఈఈ పాండురంగరావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్కో ద్వారా నానో డీఏపీ



మాట్లాడుతున్న ఇఫ్కో మేనేజర్ చంద్రబాబునాయుడు

పాపన్నపేట(మెదక్): దేశంలో మొదటిసారిగా ఇఫ్కో ద్వారా నానో డీఏపీ పంపిణీ చేయనున్నట్టు మెదక్ జిల్లా ఇఫ్కో మేనేజర్ చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళవారం పాపన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ద్రవరూప డీఏపీతో బహుళ ప్రయోజనాలున్నాయన్నారు. ఇది సాంప్రదాయ ఎరువు కంటే చౌకగా ఉంటుందన్నారు. డీఏపీ బ్యాగు రూ.1350 ఉంటే, లిక్విడ్ ధర కేవలం రూ.600 మాత్రమేనన్నారు. మొక్కల ఉత్పాదకతను పెంచడానికి లిక్విడ్ డీఏపీ సమర్థవంతమైన పరిష్కారమన్నారు. జీవశాస్త్ర పరంగా సురక్షితమే కాక నేల, నీరు, వాయు కాలుష్యాలు తగ్గిస్తుందన్నారు.


జ్యోతిర్లింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి–శ్రీదేవి దంపతులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలకేంద్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగేశ్వరాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళవారం జరిగిన ఈ పూజల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జయశ్రీ దంపతులు పాల్గొనగా, అభిషేకాలు నిర్వహించారు. తొగిట పీఠాధిపతి శ్రీమాధవనాంద సరస్వతీస్వామి హాజరై భక్తులకు ప్రవచనాలందించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీపంతులు, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, రైతుబంధు అధ్యక్షుడు సురేష్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు కొత్త ప్రభులు, నర్సింలు, దాదిగారి గంగాధర్, గడ్డం వెంకటేశం, మల్లేషం, క్రిష్ణశర్మ, మహేష్‌శర్మ, అభిలాష్‌శర్మ,రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దండుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ దీపక్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పురం మహేష్, తహసీల్దార్ భిక్షపతి,సర్పంచ్‌లు మహిపాల్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

జూన్ నుంచే జీతాలు

- పారిశుధ్య కార్మికులకు రూ.వెయ్యి పెంపు.. వచ్చే నెల నుంచి అమలు
- జిల్లావ్యాప్తంగా 1,668 మందికి లబ్ధి ..కార్మికుల్లో సంతోషం



కొల్చారం: సంగాయిపేట్‌లో శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మెదక్‌జోన్: పారిశుధ్య కార్మికులకు నెలకు రూ. 1000 వేతనం పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటించటంతో జిల్లాలో 1,668 కార్మికులకు మందికి లబ్ధి చేకూరనుంది. మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయితీలుండగా, పారిశుధ్య కార్మికులు 1,668 మంది పనిచేస్తున్నారు. వీరికి ప్రస్తుతం ఇచ్చే వేతనం నెలకు రూ.8,500 కాగా, ప్రభుత్వ ప్రకటనతో వచ్చే నెల(జూన్) నుంచి రూ.9,500 రానుంది.

- 2019లో జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులను గ్రామాల్లో నియమించారు. 500 జనాభాకు ఒక కార్మికుడి చొప్పున తీసుకున్నారు. ఇందులో భాగంగా ఐదు వందల జనాభా దాటితే ఇద్దరిని నియమించారు. అంటే 550 మంది జనాభా ఉన్నా ఇద్దరు కార్మికులకు అవకాశం లభించింది.
- రెండవసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రతి పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ, నీటిట్యాంకర్ అందుబాటులోకి వచ్చాయి. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు చెత్తసేకరణతోపాటు నీటిసరఫరా, గ్రామంలో విద్యుత్ దీపాలు ఆపరేటింగ్, పన్నుల వసూలు, పల్లెపకృతి వనాల్లో చెట్లకు నీరు పెట్టడం, పల్లెప్రగతిలో భాగంగా పలు కార్యక్రమాలు చేయాల్సి ఉంటుంది.

పల్లెలు పరిశుభ్రంగా..

ప్రతిరోజూ తడి, పొడి చెత్త సేకరణతో పల్లెలన్నీ పరిశుభ్రంగా తయారవుతున్నాయి. సేకరించిన చెత్తను వర్మీకంపోస్టుగా తయారు చేసి పల్లెప్రకృతి వనాల్లో వినియోగిస్తున్నారు. దీంతో పారిశుధ్య సమస్యల తొలగిపోయి, పల్లెలన్నీ పచ్చదనం పరుచుకుంటున్నాయి.

వ్యాధులు దూరం..

గతంలో వర్షాకాలం వచ్చిందంటే పల్లెలన్నీ అపరిశుభ్రతకు నెలవై ఉండేవి. చెత్తాచెదారం తొలగింపుతో సీజనల్ వ్యాధులు కూడా తగ్గుముఖం పట్టాయి. దోమల బెడద కూడా లేదు. పిచ్చిమొక్కల తొలగింపు, బావిబొందలు, గుంతల పూడ్చివేతతో ఏ సమస్యా లేకుండా పోయింది.

సంతోషంగా ఉంది



సీఎం కేసీఆర్ మాకు జీతం పెంచటంతో సంతోషంగా ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో అనేక రకాల పారిశుధ్య పనులు నిర్వహిస్తాం. మా కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం అదనంగా మరో వెయ్యి పెంచటంతో సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– పద్మయ్య పారిశుధ్య కార్మికుడు, జంగరాయి

జీఓ కూడా వచ్చింది



పారిశుధ్య కార్మికులకు వేతనం పెంచుతూ ప్రభుత్వం జీఓను విడుదల చేసింది. పెరిగిన జీతాలు వచ్చే నెల నుంచే పారిశుధ్య కార్మికులకు అందజేస్తాం.

– సాయిబాబ, మెదక్ డీపీఓ



దీక్షలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

రెవెన్యూ డివిజన్‌గా మారుస్తాం

రామాయంపేట డివిజన్ సాధన దీక్షలో డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయమై ప్రభుత్వం ఏ పట్టించుకోవడం లేదన్నారు. మెదక్ జిల్లా వెనుకబాటుకు గురైన విషయమై మే 15 తర్వాత ప్రత్యేకంగా 12 అంశాలతో షెడ్యూల్ విడుదల చేస్తామని, ఇందులో పేట రెవెన్యూ డివిజన్ ఒక అంశంగా ఉంటుందన్నారు.

ర్యాలీగా తరలివచ్చి...

రెవెన్యూ డివిజన్ సాధనకు రామాయంపేట, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం రామాయంపేటలో ప్రదర్శనగా వచ్చి దీక్ష నిర్వహించారు. ముందుగా టీపీసీసీ ప్రతినిధులు సుప్రభాతరావు, మ్యాడం బాలక్రిష్ణల ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇందిరాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. దీక్షా శిబిరంలో మ్యాడం బాలక్రిష్ణ మాట్లాడుతూ రామాయంపేట రెవెన్యూ డివిజన్ విషయమై ప్రభుత్వం మోసగించిందని ఆరోపించారు. గతంలో పట్టణ వాసులు 180 రోజులు దీక్షలు నిర్వహించగా, మంత్రి హామీ ఇచ్చి దీక్షలు విరమింపజేశారని ఆయన గుర్తు చేశారు. మంత్రి హామీ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నాలుగైదు కొత్త డివిజన్లు ఏర్పాటు కాగా, రామాయంపేటకు మొండిచేయి చూపారన్నారు. పీసీసీ సభ్యుడు సుప్రభాతరావు మాట్లాడుతూ డివిజన్‌కోసం గతంలో తాను ఆమరణ దీక్ష చేపట్టానని గుర్తుచేశారు. మంత్రి హామీతో తొలివిడత దీక్షలు విరమించామని, మళ్లీ దీక్షలు కొనసాగిస్తున్నా న్యాయం జరగలేదన్నారు. దీక్షలకు ప్రజలనుంచి పెద్దఎత్తున మద్దతు లభిస్తుందని, ప్రభుత్వం స్పందించకపోతే పట్టణ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నేతలు సత్యనారాయణగౌడ్, శివకుమార్, నాగులు, గోవర్ధన్, గొండస్వామి, ప్రసాద్‌గౌడ్, శంకర్ నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, డాకి స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

కలెక్టరేట్ నిర్మాణమెప్పుడు ?

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సీరియస్

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్ కార్యాలయాన్ని ఎప్పుడు నిర్మిసారు...పనులు ఏం జరగడం లేదు...పనిచేస్తారా? లేదా అని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆర్ అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. మంగళవారం జెడ్పీచైర్‌పర్సన్ హేమలతశేఖర్‌గౌడ్ అధ్యక్షతన జెడ్పీ కార్యాలయంలో 2వ, 4వ, 7వ స్థాయీ సంఘం సమావేశాలు జరిగాయి.7వ స్థాయీ సంఘ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీరాజ్ అధికారులు పనులు చేయడం లేదని, మీరు ఇక్కడ పనిచేయాలని ఉందా? లేదా అని ప్రశ్నించారు. అంతకు ముందు 2వ స్థాయీ సంఘ సమావేశంలో జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెతో గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తడం లేదా? పనులు ఎలా చేస్తున్నారని డీపీఓ సాయిబాబాను ప్రశ్నించారు. డీపీఓ మాట్లాడుతూ సీనియర్ పంచాయతీ కార్యదర్శులతో పనులు చేయిస్తున్నామని, వారి సమ్మెతో సమస్యలేమీ లేవన్నారు. అనంతరం వీఓఏల సమ్మెపై డీఆర్డీఓ శ్రీనివాస్‌ను జెడ్పీచైర్‌పర్సన్ ప్రశ్నించగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొత్త వారిని కూలీలను పెట్టుకున్నామన్నారు. జెడ్పీ సీఈఓ వెంకట శైలేషన్, డీఈఓ రాధాకిషన్, డీపీఓ సాయిబాబా, డీఆర్డీఓ శ్రీనివాస్, యువజన క్రీడల అధికారి నాగరాజులతోపాటు జెడ్పీటీసీ సభ్యులు మాధవి, రాణి, సుజాత, బాబ్యానాయక్, విజయరామరాజు, సౌందర్య, లావణ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు

మెదక్ మున్సిపాలిటీ: కాంట్రాక్ట్ అధ్యాపకుల జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమెను కాంట్రాక్ట్ అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించిన నేపథ్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మెదక్ జిల్లా సీజీఐ అసోసియేషన్ ప్రెసిడెంట్ గాండ్ల శ్రీనివాస్, సెక్రటరీ ఫర్హానా జబీన్, అధ్యాపకులు స్వర్ణలత, జ్యోతి, సరళ, జహీరా, కవిత, సంతోష్, వసంత్, మల్లన్న,వేణు గోపాల్, అశ్విన్, రాజు, లక్ష్మీనారాయణ, ఉస్మాన్ అంజయ్య, అశోక్, శివ మదన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మీకోసం.. మీ సమస్యల పరిష్కారానికే..

మెదక్ మున్సిపాలిటీ: నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ముందుంటున్నారు. మంగళవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి ప్రజల నుంచి చక్కటి స్పందన లభించింది. ఆయా మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. అక్కడే ఉన్న అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. అందుబాటులో లేని అధికారులకు ఫోన్ ద్వారా సమస్యలను వివరించి పరిష్కార దిశగా కృషి చేశారు. అనంతరం మెదక్ పట్టణం టీఎన్జీఓ భవన్‌లో మెదక్ టౌన్, హవేళిఘనాపూర్, మెదక్ మండలాలకు చెందిన 349 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు భీమరి కిశోర్, జయరాజ్, ఆర్కే శ్రీనివాస్, ఎంపీపీ యమునాజయరాం రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు కిష్టయ్య, జెడ్పీటీసీ సుజాత శ్రీనివాస్, ఎమ్మార్వో నవీన్, మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రైతులను ఆదుకుంటాం



పాడైపోయిన వరిని పరిశీలిస్తున్న, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

- ఎకరాకు రూ.10,000 నష్ట పరిహారం
- ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): వడగండ్ల వానకు నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. శంకర్‌తండా, భీమ్లాతండా, సీతారాంతండాలతో పాటు రత్నాపూర్, అల్లిపూర్, కొత్తపేట, లింగోజిగూడ, పిల్లుట్ల, తాళ్లపల్లిగడ్డ గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షంతో చేతికి వచ్చిన పంటలు చేజారిపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ప్రతి రైతుని ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఎకరాకు రూ.10,000 నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. పంటనష్టపోయిన ప్రతీ రైతు దగ్గరికి వెళ్లి పరిశీలించి రిపోర్టు ఇవ్వాలని తహసీల్దార్, వ్యవసాయశాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, జిల్లా జెడ్పీ కోఆప్షన్ నెంబర్ మన్సూర్‌అలీ, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఏఓ ప్రవీణ, సహకార సంఘం చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సింహరెడ్డి, గంగాధర్, రామ్మోహన్‌రెడ్డి, చిన్ననాయక్ పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.50.26 లక్షలు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.50,26,604 వచ్చినట్టు ఇఓ సార శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం 70 రోజుల హుండీ లెక్కించగా, నగదుతో పాటు వెండి, బంగారు కానుకలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో భ్రమరాంబికా సేవా సమితి సభ్యులు, దేవాదాయశాఖ సూపరింటెండెంట్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షించారు.

దుర్గమ్మ సేవలో అంబర్‌పేట ఎమ్మెల్యే

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కుటుంబ సభ్యులతో కలసి దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు పార్థివశర్మ, రాజశేఖర శర్మ ప్రత్యేక పూజలు అర్చన చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



నేటితో పుష్కరాల ముగింపు

మంజునాథస్వామికి అభిషేకం

మెదక్ రూరల్: మెదక్ మండలం పేరూరు శివారులోని సరస్వతీఆలయం వద్ద జరుగుతున్న పుష్కరాలు మంగళవారంతో 11వరోజుకు చేరుకున్నాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించి సరస్వతీమాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మకు పసుపు, కుంకుమలతో వాయినాలు సమర్పించి శ్రాద్ధకర్మలు, పిండ ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేత, హైకోర్టు న్యాయవాది తాళ్లపల్లి రాజశేఖర్ పుష్కర ఘాట్‌లో పుణ్యస్నానం చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు రాజమౌళి శర్మతో పాటు ప్రధాన పూజారులు గుణాకర్‌శర్మ, మహేష్ శర్మలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రంతో 12 రోజులు పూర్తి చేసుకొని పుష్కరాలు ముగియనున్నాయి. ముగింపు వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కడుపు నిండేదెలా?

నర్సంపల్లి తండాలో 120 మందికి అందని రేషన్ బియ్యం



తండాలో రేషన్ బియ్యం అందని బాధితులు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లి తండాలో 135 తెల్లకార్డుదారులుండగా, రేషన్ దుకాణం ఏర్పాటు చేశారు. ప్రతి నెలా తండాకు 135 నుంచి 145 క్వింటాళ్ల వరకు రేషన్ బియ్యం సరఫరా అవుతుంది. ఏప్రిల్ నెల కోటాకుగాను పురుగులు పట్టి తుట్టెలు కట్టిన బియ్యం తండాకు సరఫరా కాగా, తండావాసుల్లో 40 కుటుంబాలవారు తుట్టెలు కట్టిన బియ్యాన్ని తీసుకోలేదు. దీంతో డీలర్ ఆ బియ్యాన్ని చేగుంట సివిల్ సప్లై గోదాంకు వెనక్కి పంపారు. రెండు, మూడు రోజుల అనంతరం వేరే బియ్యాన్ని సరఫరా చేశారు. వచ్చిన బియ్యం సరఫరా ప్రారంభించేలోపే ఆన్‌లైన్ క్లోజ్ అయ్యింది. సర్వర్ బంద్ కావడంతో డీలర్ తనవద్ద ఉన్న స్టాక్ బియ్యాన్ని వినియోగదారులకు ఇవ్వలేకపోయారు. దీంతో 40 కుటుంబాల్లో ఉన్న 120 మంది అన్నం లేక రొట్టెలు తింటున్నారు. ఈ విషయమై వారు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

పురుగుల బియ్యం వచ్చాయి



తండాకు పోయిన నెల కోటాకింద మొత్తం పురుగులతో తుట్టెలు కట్టిన బియ్యాన్ని సరఫరా చేశారు. మేం తీసుకోలే..డీలర్ కరాబైన బియ్యాన్ని వాపస్ పంపించారు. బియ్యం వచ్చినా మాకు ఇయ్యలేదు. మాఇంట్లో బియ్యం లేక పిల్లలు ఇబ్బందులపాలవుతున్నారు. – బుజ్జి

రొట్టెలు తింటున్నాం



ప్రతినెలా మాదిరిగానే పోయిన నెల బియ్యం వస్తాయనుకొని ఉన్న వడ్లను అమ్ముకున్నాం. పురుగుల బియ్యం బదులు వేరే బియ్యం వచ్చినా అవి పంపిణీ చేసేలోగా సర్వర్ బంద్ చేశారు. దీంతో తినడానికి బియ్యం లేకపోవడంతో మక్క రొట్టెలు తింటున్నాం. –రవి

క్లుప్తంగా

హాల్ టికెట్ ఒకరిది.. పరీక్ష రాసేది ఇంకొకరు

ఇరువురిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: ఓపెన్ టెన్త్ పరీక్షల్లో ఓ విద్యార్థి బదులు మరో విద్యార్థి పరీక్ష రాసేందుకు యత్నించిన ఘటనలో పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ పదో తరగతి పరీక్షల్లో ఖైల్‌కు చెందిన యూనుస్ అనే విద్యార్థికి బదులు సోమవారం సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్ష రాయబోయిన ఫలక్‌నుమాకు చెందిన బాలుడిని పరీక్ష గదికి వెళ్లే ముందు నిర్వహించిన తనిఖీలో పోలీసులు పట్టుకున్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని రాజీవ్ రహదారిపై తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 17 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి వారికి రూ.38,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

మనోహరబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన కాళ్లకల్ శివారులో జాతీయరహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కామారెడ్డికి చెందిన సాయి అతడి కుటుంబ సభ్యులు ఆటోలో హైదరాబాద్ వైపునకు వెళ్తున్నారు. ఆటో ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ఆటో లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో సాయి తల్లి మల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి.

కాటేజీల నిర్మాణం చకచకా...

- చివరి దశకు నిర్మాణ పనులు
- వినియోగంలోకి నర్సాపూర్- అర్బన్ పార్కు



నర్సాపూర్ అర్బన్ పార్కులో నిర్మిస్తున్న కాటేజీలు

నర్సాపూర్: నర్సాపూర్‌లో అటవీ శాఖ నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. ఇక్కడి అడవులను అటవీ శాఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా నర్సాపూర్–హైదరాబాద్ మార్గంలో అర్బన్ పార్కుగా చేసి వినియోగంలోకి తెచ్చారు. అందులో వాచ్ టవర్‌తో పాటు పలు నిర్మాణాలు చేపట్టి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడి అటవీ అందాలను వీక్షించే అవకాశం ప్రజలకు కల్పించనున్నారు.

సుమారు రూ. 2కోట్లతో నిర్మాణాలు

అర్బన్ పార్కులో కాటేజీలు నిర్మించాలని అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నర్సాపూర్ రాయరావు చెరువును ఆనుకుని ఉన్న అడవి ప్రాంతంలో కాటేజీలు నిర్మిస్తున్నారు. కాటేజీల నుంచి చెరువు, అడవి సోయగం కనువిందు చేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. అందులోభాగంగా సుమారు రూ.2కోట్లతో ప్రణాళిక తయారు చేశారు. కాటేజీల నిర్మాణ పనులు చేస్తున్నారు. 2 అధికారుల నివాసపు కాటేజీలు, డైనింగ్ హాలు, ఐదు విజిటర్స్ నివాసపు కాటేజీలు, ఒక విజిటర్స్ డైనింగ్ కాటేజీ, కామన్ కిచెన్, రిసెప్షన్ కలిపి 11 నిర్మిస్తున్నారు. కాటేజీల పక్కన నీటి సదుపాయానికి ట్యాంకు నిర్మాణం చేపట్టారు. దాదాపు కాటేజీల నిర్మాణ పనులు పూర్తవగా కొన్నింటిలో చిన్న చిన్న పనులు కొనసాగుతున్నాయి.

కాటేజీలు అందుబాటులోకి వస్తే మరింత అభివృద్ధి

అర్బన్ పార్కుతో నర్సాపూర్ అడవులు ఇప్పటికే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందింది. శని, ఆదివారాల్లో మెదక్, హైద్రాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి తదితర జిల్లాలకు చెందిన ప్రజలు అర్బన్ పార్కును వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. అటవీ శాఖ నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు చెబుతున్నారు.



కొనసాగుతున్న ఫర్నిచర్ పనులు

త్వరలో ప్రారంభిస్తాం

నర్సాపూర్ అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయని స్థానిక ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్ చెప్పారు. కాటేజీలలో చిన్న చిన్న పనులు ఉండగా వాటిని చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అన్ని పనులు పూర్తయిన వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

–అంబర్‌సింగ్, ఎఫ్ఆర్ఓ, నర్సాపూర్

గోడ కూలి మహిళ దుర్మరణం



శిథిలాల కింద అనూష



అనూష (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): గోడ కూలి మహిళ దుర్మరణం పాలైన ఘటన అక్కన్నపేట మండలం, గుడాటిపల్లి గ్రామ పరిధిలోని సోమాజితండాలో చోటుచేకుంది. ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం..హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన బదనాపురం అనూష(30)వార్డు మెంబర్‌గా ఎన్నికైనప్పటికీ బతుకుదెరువు కోసం ఇనుప సామాన్లు ఏరుకొని అమ్ముకోవడం, భర్త కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చివరిదశకు చేరుకోవడంతో అక్కడ వారం రోజులుగా అనూష ఇనుప సామాన్లను ఏరుకుంటుంది. సోమవారం కూడా ఓ ఇంట్లో ఇనుప సామాన్లను ఏరడానికని వెళ్లి తిరిగి రాలేదు. భర్త, కుటుంబీకులు ఫోన్ చేసినా ఆమె స్పందించలేదు. మంగళవారం భర్త, అత్త, బంధువులు గుడాటిపల్లి ముంపు గ్రామాల్లో వెతికారు. మధ్యాహ్నం సోమాజితండాలో పాడుబడిన ఇల్లు గోడకూలిన శిథిలాల్లో విగతజీవిగా కనిపించింది. దీంతో ఆమెను చూసిన బంధువులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. భర్త తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వివేక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): ఇటుక బట్టీ వద్ద ఆడుకుంటుండగా ఓ బాలిక అదృశ్యమైన ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ఒడిషా రాష్ట్రం బోలింగర్ జిల్లా, పట్నంఘర్‌లోని, జోలెన్ బార్ గ్రామానికి చెందిన చిత్రుసావర్, భనీతసావర్‌లు రవిబాబు నడిపిస్తున్న ఇటుక బట్టీలో పనులు చేసేందుకు ఐదు నెలల క్రితం వచ్చి స్థిరపడ్డారు. వీరి ఇద్దరి పిల్లలతో పాటు తొమ్మిదేళ్ల కాజల్‌ను కూడా తోడు తెచ్చుకున్నారు. గత నెల 30న కాజల్ ఆడుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. సమీపంలో ఎంత వెతికినా బాలిక ఆచూకీ తెలియలేదు. ఈ విషయాన్ని భనీతసావర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ విజయకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

దళిత బంధు యూనిట్ల తనిఖీ



తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి

గజ్వేల్: గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన 'దళిత బంధు' యూనిట్లు పొంది వివిధ వ్యాపారాలను నిర్వహించుకుంటున్న తీరును మంగళవారం గజ్వేల్‌లో 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి తనిఖీ చేశారు. రెడీమేడ్, హర్డువేర్ షాపులు ఇతర వ్యాపారాలు నిర్వహిస్తూ ఎంత ఆదాయం పొందుతున్నారో ? వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నెలనెలా మంచి ఆదాయం పొందుతున్నామని తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నామని 'గడా' అధికారికి వారు వివరించారు. ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేవిధంగా దళిత బంధును సద్వినియోగం చేసుకోవాలని ముత్యంరెడ్డి వారికి సూచించారు.

పౌరసరఫరా అధికారుల తనిఖీలు



చేర్యాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణ కేంద్రంలోని కడవేర్గు రోడ్డులోని రాజస్థాన్ స్వీట్ హౌజ్‌లో ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు అమ్ముతున్నారని తెలంగాణ కన్స్యూమర్ ఫోరం చేర్యాల మండల అధ్యక్షుడు జి.రవి కుమార్ ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం జిల్లా తునికల, కొలతల అధికారి శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలిసి సంబంధిత స్వీట్ హౌజ్‌ను తనిఖీ చేశారు. వారిని విచారించిన అనంతరం ఎమ్మార్పీధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని తేలడంతో యజమానిపై కేసు నమోదు చేసినట్లు అధికారి తెలిపారు.

ఆన్‌లైన్‌లో సైబర్ మోసం

- ఇద్దరికి రెట్టింపు నగదు ఆశ చూపి..

రూ.31,60,000లు అపహరణ



పటాన్‌చెరు టౌన్: రెట్టింపు నగదు ఇస్తామని ఆశ చూపి ఆన్‌లైన్‌లో ఇద్దరు వ్యక్తుల నుంచి పెద్ద ఎత్తున నగదు సైబర్ నేరగాళ్లు దోచుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఏప్రిల్ 20వ తేదీన వాట్సాప్‌లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన మెసేజ్‌కు స్పందించాడు. ఇందులో పెట్టుబడి పెట్టి టాస్కు పూర్తి చేస్తే రెట్టింపు నగదు ఇస్తామని ఆశచూపారు. వారి మాటలు నమ్మిన బాధితుడు ఏడు రోజుల పాటు రూ.30లక్షల వరకూ పెట్టుబడి పెడుతూ వచ్చాడు. ఇచ్చిన టాస్కులన్నీ పూర్తి చేశాడు. అనంతరం పెట్టిన నగదుతో పాటు రెట్టింపు నగదు ఇవ్వాలని సదరు బాధితుడు కోరాడు. ఆ వ్యక్తుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. వెంటనే బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు.

మరోఘటనలో


అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన ఓ వ్యక్తి ఏప్రిల్ 15న తన ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు 16వ తేదీన వివరాలు నమోదు చేసి రూ.1,60,000లు పెటాడు. ఇచ్చిన టాస్కుల అనంతరం తిరిగి నగదు చెల్లించమని అడగగా స్పందించలేదు. దీంతో తను కూడా సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడు. ఆ తరువాత అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురి ఫిర్యాదులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



గుండ్ల బాబు (ఫైల్)

చేగుంట(తూప్రాన్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వడియారం శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వడియారం గ్రామానికి చెందిన గుండ్ల బాబు(27) ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం తను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమీప బంధువునకు ఫోన్‌లో సమాచారం చేరవేశాడు. దీంతో అతను వడియారం శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఆత్మహత్య విషయాన్ని రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. రైల్వే ఎస్ఐ తావూ నాయక్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

ద్విచక్రవాహనాలు అదుపు తప్పి చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చౌటకూరు మండలంలో జరిగింది. పుల్కల్ ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నారాయణ ఖేడ్ పట్టణానికి చెందిన సందిప్ గౌడ్(18) ఏప్రిల్24 నారాయణఖేడ్ నుంచి ఐపీఎల్ మ్యాచ్ చూడడానికి బైక్‌పై హైదరాబాదుకు వెళ్లి వస్తున్న క్రమంలో చౌటకూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో నేషనల్ హైవేపై ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అక్కడి వారు 108లో అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్సనిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిద్దిపేటఅర్బన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట పట్టణంలో మంగళవారం జరిగింది. సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం..ప్రశాంత్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన బండి లింగయ్య (30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పని కోసం తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. పని ముగించుకొని వస్తున్న క్రమంలో హరిహర రెసిడెన్సీ కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి అంబులెన్స్ ద్వారా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: వేసవి సెలవుల్లో పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. దీంతో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. సరదా కోసం చెరువులు.. బావులకు ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. లేదంటే ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను మైనర్లకు ఇవ్వొదన్నారు.

'సూరంపల్లి సర్పంచ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి'

దుబ్బాక: అంబేడ్కర్ జయంతిలో పాల్గొన కుండా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించారని వెంటనే సర్పంచ్ నర్సింలును సస్పెండ్ చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం దౌల్తాబాద్ ఎంపీడీఓ రాజేష్ కుమార్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జయంతిలో సర్పంచ్, ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించినందుకు తన స్థాయిని మరచి బూతులు తిట్టాడని ఆరోపించారు.

కారు ఢీ కొని వ్యక్తి..



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

న్యాల్‌కల్(జహీరాబాద్): కారు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గంగ్వార్ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బీదర్ జిల్లా యాకత్‌పూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ సమద్(55) తన మనుమడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో న్యాల్‌కల్ మండల పరిధిలోని గంగ్వార్ గ్రామ సమీపంలో గల సాహేబ్ వద్దకు వచ్చాడు. కూతురిని, మనుమడిని అక్కడ దించి తిరిగి వెళ్తున్న క్రమంలో వెనకాల నుంచి అతి వేగంగా కారు బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో అబ్దుల్ సమద్‌కి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అబ్దుల్ సమద్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్ సందర్శించారు. మృతుడి కుమారుడు ఎండీ ఇలియాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్‌తో గుర్తించి సిద్దిపేట టూటౌన్ పోలీసులు బాధితుడికి అందజేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పెద్దమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన దేవిరెడ్డి తన సెల్‌ఫోన్‌ను ఏప్రిల్ 22వ తేదీన పట్టణంలో పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. అనంతరం ఫోన్ ఆచుకీ తెలుసుకొని రికవరీ చేశారు. బాధితుడిని మంగళవారం పిలిపించి సీఐ రవికుమార్ అందజేశారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

గజ్వేల్‌రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి అప్పగించినట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన చిక్కుడు యాదగిరి వారంరోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఫోన్‌కు సంబంధించిన వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేసి అనంతరం ఫోన్ ఆచూకీ తెలుసుకొని బాధితునికి అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఝరాసంగం(జహీరాబాద్): కూరగాయలు అమ్ముతున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును తెంపుకొని పారిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మండల పరిధిలోని సంఘం(కె) గ్రామానికి చెందిన పట్లోళ్ల విట్టమ్మ ఝరాసంగంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు సంతలో టమాటాలు అమ్ముతుంది. ఈ క్రమంలో కొండాపూర్ మండల పరిధిలోని తొగర్ పల్లి గ్రామానికి చెందిన బి. నర్సింలు టమాటాలు కావాలని అడిగాడు. ఆమె టమాటాలు ఇస్తున్న క్రమంలో మెడలో నుంచిపుస్తెలతాడు తెంచుకొని పారిపోతుండగా స్థానికులు అతన్ని పట్టుకున్నారు. దేహశుద్ది అనంతరం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేందర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కౌడిపల్లిలో ప్రైవేటు ఆస్పత్రి సీజ్



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయనిర్మల

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలో సరైన ధ్రువపత్రాలులేని ప్రైవేటు ఆస్పత్రిని సీజ్ చేయడంతోపాటు మరో రెండు ఆసుపత్రులకు జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారులు నోటీసులు జారీచేశారు. మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయనిర్మల కౌడిపల్లిలోని సీహెచ్‌సీతోపాటు శ్రీవేంకటేశ్వర నర్సింహోం, కేర్ నర్సింగ్‌హోం, ఉమా నర్సింగ్‌హోంను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలులేని ప్రైవేటు ఆసుపత్రిని సీజ్ చేసి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో నర్సింగ్‌హోంకు సంబంధించి ధ్రువపత్రాలు అందచేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇచ్చిన గడువులోపు సరైన ధ్రువపత్రాలు సమర్పించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఆలయాల్లో చోరీ

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని రెండు ఆలయాల్లో సోమవారం చోరీ జరిగింది. పాండచెరువు కట్టపై ఉన్న కల్యాణ రామచంద్రస్వామి, గొల్పర్తి పెద్దమ్మ ఆలయ తాళాలు పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడుతోపాటు నగదు అపహరించుకపోయారు. క్లూస్‌టీం వివరాలు సేకరించారు.

స్థల వివాదంలో ఘర్షణ

నలుగురికి తీవ్ర గాయాలు



ఘర్షణ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ నాగరాజు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో ఓ స్థల వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. మంగళవారం జోగిపేట సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సర్వేనెంబర్ 174లోని భూమిలో చాలా కాలంగా ఇరు వర్గాల మధ్య గొడవ జరుగుతుంది. ఆ స్థలంలో పట్టణానికి చెందిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ సయ్య మహేష్, అతని కుమారుడు తేజ ఆ స్థలంలో నిర్మాణం చేపడుతుండగా హనుమంతరావుపేట సంపత్ గౌడ్, సాయినాథ్ గౌడ్‌లు పని నిలిపివేయాలని వారిని కోరారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాట మాట పెరిగింది. ఒకరిపై మరొకరు దాడులకు దిగారు. డీఎస్పీ మహేష్ కుమారుడు తేజ సంపత్, సాయినాథ్‌పై దాడి చేయడంతో తలకు, కాలు, చేయి, దవడకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తేజను సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సీఐ నాగరాజు పరిశీలించారు.

పరస్పరం ఫిర్యాదులు

డీఎస్పీ సయ్య మహేష్, అతని కొడుకు తేజా తమపై ఇనుప రాడ్డు, నేకల్ పంచుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని రామాగౌడ్ జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై కూడా రామాగౌడ్, ప్రవీణ్ గౌడ్, సంపత్ గౌడ్, ప్రదీప్ గౌడ్‌లతోపాటు పదిమంది దాడి చేసినట్లు సయ్య మహేష్ న్యాయవాది ద్వారా జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై హత్యాయత్నం కేసు

జోగిపేటలో భూ వివాదానికి సంబంధించి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్ఐ–2 జయశంకర్ తెలిపారు. సంపత్‌గౌడ్, సాయినాథ్‌గౌడ్‌లపై దాడి జరిపిన కేసులో తేజ, డీఎస్పీ మహేష్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. డీఎస్పీ మహేష్ చేసిన ఫిర్యాదుతో నలుగురితో పాటు మరికొంతమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో విచారణ జరిపి తగుచర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజు పేర్కొన్నారు.



గాయపడ్డ సంపత్



సాయినాథ్ గౌడ్

ద్విచక్ర వాహనాలు ఢీ

నలుగురికి గాయాలు

కొల్చారం(నర్సాపూర్): రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని నలుగురికి గాయాలైన సంఘటన మండల కేంద్రం సమీపంలోని మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారి లోతువాగు మూల మలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా బాలానగర్‌కు చెందిన నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై ఏడుపాయల వనదుర్గాదేవిని దర్శించుకునేందుకు వెళ్తునట్లు తెలిపారు. అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో లోతు వాగు సమీపంలోకి రాగానే, బైకులు అదుపుతప్పి ఒకరినొకరు ఢీ కొన్నారు. దీంతో నలుగురికి గాయాలు కాగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.